# నా ఖర్మమిట్లా కాలింది

నన్ను శిక్షిస్తారుట. పూర్వజన్మంలో నేనేం పాపం చేశానో యేమో గాని, దైవం నన్ను కనికరంలేని యినపమరలో పెట్టి నొక్కి రక్తం పీల్చేశాడు, వెమికలు కటకటమని ముక్కలకింద నలగకొట్టాడు. నాకు జీవితం మీద యేమీ కోర్కెలేదు. 'నా వెంకట్రావు మళ్ళీ యెన్నటికన్నా వస్తాడేమో' అతనికింక లోకంలో యెవరూ వుండరే, అని ప్రాణాలు బిగబట్టుకుని బతికి వున్నాను. కాని లేకపోతే నాకీ లోకంలో పనేముంది? ఈ యిరవై యేళ్ళలోనే, నా నూరేళ్ళ బతుకూ గడిచిపోయింది. నేను చేసిన యీ అక్రమానికి, నా గర్భంలోని శిశువు ప్రాణం తీసినందుకు నన్ను కూడా వురితియ్యనీండి. కనికరించి నన్ను వొదలనీకండి. మళ్ళీ ఆ యింటి మొహం నేను చూడలేను. నన్నెక్కడికన్నా ద్వీపాంతర వాసానికి పంపమనండి. ఇంక నేనీ బతుకు బతకలేను. వినండి మరి -

వెంకట్రావుకి నాకూ వున్న ప్రేమానుబంధానికి ఆరంభం లేదు. పూర్వజన్మల నించి తెచ్చుకున్నాము మా స్నేహాన్ని. యెన్ని జన్మలకిందటో జరిగిన చరిత్రనే మళ్ళీ అనుభవించాము, మా చిన్నతనపు ఆటల్లో, పాటల్లో, పోట్లాటల్లో జ్ఞాపకమొస్తోంది..... ఒకనాటి సాయంకాలం నేనూ అంతనూ పొలానికి వెళ్ళి వరికంకులూ, పిల్లి పెసర కాయలూ కోసుకుతింటో, పొద్దుమరిచాము. మోకాలులోతు పంటకాలవలో బట్టలు పైకెత్తుకుని, సంధ్య కిరణాల్లో మెరిసే నీటిలో నడిచివాస్తోవుంటే యెదురుగా తాటి తోపులో సూర్యుడు కుంకాడు. తుమ్మల్లోకి మేము చేరుకునేటప్పటికి చీకటయింది. ఆ చెట్ల కొమ్మల్లో దయ్యాలు వూగుతున్నట్లు కనపడేవి నాకు -

"వెంకట్రావ్, భయమేస్తోంది నాకు."

"నేనున్నానుగా, నీకేం భయం?"

నా చేతిచుట్టూ అతని వేళ్ళు వొణుకుతున్నాయి. కాని "నేనున్నానుగా" అని అంటోనే వున్నాడా ధీరుడు. ఒకసారి అత్త నన్ను కొడుతూ వుంటే యెక్కణ్ణించో వచ్చి ఆమెని తోసివేశాడు.

"నీ కెట్లా తెలిసింది?" అంటే...

"నీ కంఠం యెంత మెల్లిగా యేడ్చినా, నాకు కలలోకూడా వినబడుతుంది, చెల్లీ!" అన్నాడు.

నేను పెద్దాదాన్నైన తరవాత మా యిద్దరిమధ్యా పెద్ద సిగ్గొకటి యేర్పడ్డది. వెంకట్రావు శలవులకి యింటికి వొచ్చినప్పుడల్లా, వికసిస్తున్న అతని కళ్ళనీ మొహాన్ని ఒకయేడూ, లావవుతున్న మెడనీ చేతుల్నీ వొకయేడూ, నల్లపడుతున్న పెదిమల్ని వొకయేడూ చూసి, వొళ్ళు ఝల్లుమనేది. నా వాడు, నా వెంకట్రావు, అని గర్వం కలిగేది.

నాకు పదేహేనేళ్ళప్పుడు గావును కిష్టయ్య మొదట మా వూళ్లో కనపడ్డది. అతన్ని చూడగానే అందరూ యింత అందమైనవాడు, గొప్పవాడు యెవరా అని ఆశ్చర్యపడ్డారు. అతని వల్లెవాటు వుత్తరియ్యం, మెరిసే స్లిప్పర్లూ, కోరమీసం, పెద్ద క్రాపుజుట్టూ, అన్నీ, అందరి కళ్ళనీ ఆకర్షించాయి. అతను అటు వొస్తే స్త్రీలు కిటికీల దగ్గిరా తలుపుల వెనకా చేరేవారు. చివరికి అమ్మకి కూడా, అతను గొప్ప డాక్టరని తరవాత తెలిసింది. నా చెల్లెలు సీత విషజ్వరం కుదిర్చినప్పట్నించి, అతనూ తరచూ ఆ యింటికి వొస్తోవుండేవాడు. అతన్ని చూస్తే నాకేదో భయంగా వుండేది. కాని అప్రయత్నంగా నా కాళ్ళు అతని దగ్గిరికి తీసుకుపోయేవి. కళ్ళు తిప్పుకోలేను. మొదటి రోజున నన్ను అతను యెగాదిగా చూస్తోవుంటే నా శరీరాన్ని వస్త్రహీనం చేసి చూస్తున్నట్లనిపించింది.

ఒకరోజు సాయంత్రం కిష్టయ్య నా యింటికి వొచ్చాడు. నాన్న వూళ్ళోలేరు, అమ్మ వంటచేస్తోంది. ఎవరో చూడాలని చీకట్లో గుమ్మం దగ్గిరికి వెళ్ళాను. అతనే లోపలికి వచ్చి, నా భుజంమీద చెయ్యేసి, "ఎవరూ లేరా?" అన్నాడు దూరంగా జరిగి లేరన్నాను. "ఇట్లారా నువ్వు" అని నా వంక సూటిగా చూశాడు. నా కళ్ళని తిప్పుకోలేక, అతనివేపే జరిగాను. నా చెంప మీద చెయ్యేశాడు. నా కాళ్ళూ వొళ్ళూ వొణుకుతున్న సంగతి అతనికి తెలిసినట్టుంది. బరువుగా చెయ్యేసి "రేపు రాత్రి యెనిమిదింటికి, చెరువు దక్షిణపు గట్టున గంగరావిచెట్టు కిందికిరా వొస్తావా?"

నాకు మాట్లాడ్డానికి నాలిక రాలేదు.

"నాకు తెలుసు వస్తావు" అని వెళ్ళిపోయినాడు. అతను వెళ్ళింతరవాత "యెవరనుకున్నాడు! నాకు తెలీదూ యెందుకు రమ్మన్నాడో! పోకిరీ వెధవ! యెంత ధైర్యం!" అని చాలా రోషపడ్డాను. అమ్మతో చెపుదామనుకున్నాను. కాని చెప్పినట్లు జ్ఞాపకంలేదు...

తరవాత మూడు నాలుగు నెలలు అతన్ని తప్పించుకుని తిరిగాను. శ్రావణ పౌర్ణమి సాయంత్రం అందరం గుళ్లోకి వెళ్ళాము. వెంకట్రావు కూడా వొచ్చాడు. మా యిద్దరికి పెళ్ళి సంగతి తలపెడుతున్నారు ఆ రోజుల్లో. చీకటిపడ్డది, వెనకనించి వెన్నెలా, ముందునించి గుడిదీపాల వెలుతురూ మా మీద పడుతో వుంటే ధ్వజస్తంభం చుట్టూ కూచుని కులాసాగా మాట్లాడుకుంటున్నాము. సీత వచ్చి, నా చెవులో "అక్కయ్యా గుడి వెనకాల ఎవరో రుషి వున్నాడు, పోయి చూడు" అంది. వెంకట్రావుని కూడా తీసికెళ్ళాలనిపించింది. కాని పాడు సిగ్గు కొంప ముంచింది. గుడి వెనకాల పచ్చగన్నేరు మొక్కలచాటున కిష్టయ్య నుంచొని వున్నాడు. వెనకాలకి పోవాలంటే కాళ్ళు కదలవు. "నన్ను తప్పించుకుంటావా?" అన్నాడు. నా దగ్గిరికి నడిచివొచ్చి, దగ్గిరికి లాక్కుని, తిప్పి వున్న నా మొహాన్ని చేత్తో తనవేపు తిప్పుకుని, చెంపమీద మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు. నాకు కస్తూరి వాసనవేసింది అతని పెదిమల మీదనుంచి.

"చిన్నతల్లివి కదూ? చెప్పినట్లు విని, రేపురా యిక్కడే వుంటా వేరెవ్వరూ వుండరు. సాయింత్రం వస్తావు కదూ."

నేను మాట్లాడలేదు.

"యెంత బావుంటుందనుకున్నావు! నీకే తెలుస్తుంది తప్పకుండా రా. వస్తావు కదూ!"

మళ్ళీ కళ్ళెర్రజేసి,

"రాకపోతివా, నీ గతి చూసుకో" అని వెళ్ళిపోయినాడు.

కిష్టయ్య దగ్గిరికి వెళ్ళాలని నాకేమాత్రమూ లేదు. కాని భయపెట్టినప్పటి అతని కళ్ళచూపే జ్ఞాపకం వచ్చింది. వెళ్ళకపోతే యీసారేం చేస్తాడో? ఆలోచించి వెంకట్రావుకి ఆ సంగతి కబురు పంపాను. తరవాత యేం జరిగిందో నాకు అప్పుడు తెలీలేదు. అంతా ముంచుకొచ్చిం తరవాత, నా ప్రారబ్దం బద్దలయిం తరవాత తెలిసింది. మర్నాడు సాయింత్రం గుడి వెనకాల కిష్టయ్యని తన్నటానికి సిద్ధమైనాట్ట వెంకట్రావు. కిష్టయ్య నవ్వి.

"నేనా ఆ అమ్మాయిని రమ్మన్నది? ఆమె నన్ను బలవంతం చేస్తే! పైగా మీతో చెప్పిందా యిట్లా? ఎంతకన్నా సమర్ధురాలు అన్నాట్ట. అప్పుడే ఆ సంగతి నాకు తెలిస్తే! చెప్పావు కాదు కదూ! వెంకట్రావ్! నా మీద నీకా కాస్త నమ్మకం లేకపోయింది కదూ? ఆడదంటే అంతలోకువ. యెంత విపత్సముద్రంలో పడ్డాం? దానిమధ్య పడి వొడ్డు చేరలేక, తన్నుకుని, నలిగి యిట్లా అయినాము. మొదట వెంకట్రావు, అతని అబద్దాలు నమ్మలేదు. కాని ఆ జిత్తులమారివాడు యేం చెప్పాడో చేమిటో!

మర్నాడు నేను గదిలో వొంటరిగా కూచునివుండగా కిష్టయ్య లోపలికి వచ్చాడు. నేను తెల్లబోయి లేచి నుంచున్నాను. నాతో బాగా చనువుగల వాడిమల్లే చుట్టూ చేతులేసి, దగ్గిరికి అదుముకొని, నా కళ్ళలోకి నిదానంగా చూస్తో, నెమ్మదిగా, ధైర్యంగా, దృఢంగా, "నన్ను ముద్దుపెట్టుకో అన్నాడు" మళ్ళీ కస్తూరివాసనవేసి నా తల తిరిగింది, ముద్దువలె, పాటవలె నా చెవిని తాకాయి ఆ మాటలు రెండూ, నా స్వాధీనం తప్పి తిరగబడి, అతని మొహం వంచి నోటిమీద ముద్దుపెట్టుకున్నాయి నా పెదిమలు. నన్ను వెనక్కివంచి మెడమీదా, కిందా ముద్దుపెట్టుకున్నాడు అతను. తిరిగిపోయే నా తలని అతని బుజంమీద ఆనింది, కొట్టుకునే హృదయోద్రేకాన్ని ఆపడానికి అతన్ని ఆనుకుని కళ్ళు మూసుకున్నాను... నాన్నా, వెంకట్రావు గదిలోకి వచ్చారు. ఎన్నడూ నీ మొహం అంత భయంకరంగా కనపడలేదు - ఆ మధ్యాన్నం లాగు, చివరరాత్రి కూడా. వెంకట్రావ్ నా వంక నిదానంగా చూసి, మూలిగి నాన్న తన గదిలోకి వెళ్ళిపోయినారు. నేనూ వెంకట్రావే మిగిలాం ఆ గదిలో. ఆ నిమిషాన కూడా నా హృదయమంతా అతనిదే. ఆ కిష్టయ్య వెళ్ళగానే వాణ్ణి

చంపెయ్యాలనిపించింది. వెంకట్రావ్, నా మీద అంత ప్రేమ వున్నవాడివి వాడి గొంతుక పిసక్క యెందుకు వొదిలావు? బలహీనురాలనై, కళ్ళుమూసుకు గోతిలో పడితే, నన్ను వొదిలేస్తావా? ఆడదాన్ని వొంటరిగా, నిస్సహాయంగా విడిచి పెడతావా? యింతేనా నువ్వు చదువుకుని సంపాదించిన తెలివల్లా? ఆ రోజున కూడా నా జీవినమంతా, హృదయమంతా వెంకట్రావుదే కాని యెట్లా అతన్ని నమ్మించడం? అతని పాదాలమీద పడి "నువ్వు చూసిందంతా మాయ, వాడు మాంత్రికుడు, నువ్వేమీ చూడలేదు. అంతా అబద్ధం" అని అతను నమ్మి జాలిపడేట్టు యాడవాలనిపించింది. కాని నా పాదాలకి సిగ్గూ, అభిమానం బంధాలు పడ్డాయి, నా గతి, నేను చేసుకున్న పాపం! వెంకట్రావుకి వుత్తరం రాయాలని పదిసార్లు కూచున్నాను రాత్రంతా మేలుకుని. కాని వాణ్ణి యెందుకు ముద్దు పెట్టుకున్నానో యెట్లా చెప్పటం? ఎవరి కర్థమవుతుంది? నాకు మాత్రం ఏం అర్థమవుతుంది? తరవాత ఎప్పుడో ఎవరో అన్నారు. ఆ కిష్టయ్యకి ఏవో మంత్రాలు, హిప్నాటిజం అట, అవేవో చాతనవునని.

నన్ను కిష్టయ్యకిచ్చి పెళ్ళిళ్ళు చేస్తారని మర్నాడు తెలిసింది. పెళ్ళిదాకా ఆ రోజులన్నీ కొయ్యనై పడివున్నాను. వెంకట్రావుని కలుసుకుని మాట్లాడదామంటే, అతను వూరువిడిచి వెళ్ళిపోయినాడు. నాన్న, వెంకట్రావు, నన్ను పెళ్ళి చేసుకోకపోతే అతన్ని తంతామనీ, వూళ్ళో నిలవడానికి వీల్లేకుండా చేస్తామనీ, పెళ్ళి చేసుకుంటే నాలుగు వేలిస్తామనీ చెప్పి వాణ్ణి వొప్పించారట. నాకు తరవాత తెలిసింది.

కిష్టయ్యతో కాపరం చాలా మధురంగా వుంది. నన్ను మంత్రించినట్టు వలలో వేసుకుని బానిసని చేసుకున్నాడు. ఆడదాన్ని మోహింపచేసి, లాలించి, తృప్తిపరచటం అతనికే తెలుసు. పుట్టినప్పటినించి ఆ శాస్త్రం తప్ప యింకేమీ చదివి అభ్యాసం చెయ్యనట్టుంది. మెరిసే అతని కళ్ళవేపు చూస్తో, అతని చేతుల్లో రొమ్ముకు అనుకుని పడుకుంటే, యింకా యేమీ జ్ఞాపకముండదు. పైన గది తగలపడుతున్నా, కింద తేళ్ళు కుడుతున్నా, కదిలేశక్తి పోతుంది. రోజు రోజూ అతని మీద మోహం మెక్కువయింది. అతన్ని ఒక్క నిమిషం వదల్లేను, అతనే దైవం, అతనే లోకం, ఆడవాళ్ళందరూ నన్ను చూసి యీర్ష్య పడుతున్నారు కిష్టయ్య భార్యనని. కాని ఆ రోజుల్లో కూడా నా కళ్ళ ముందునించి అతను ఒక్క నిమిషం అవతలికి వెళ్ళగానే అతను మళ్ళీ రావాలనే ఆత్రుత నాకుండేదికాదు. వెర్రితీపి తింటే చేదు తోచినట్లు వెగటు పుట్టేది. అతన్ని మళ్ళీ చూడకుండా కొంతకాలం యే వూరన్న వెళ్ళిపోయి వస్తే బావుండుననిపించేది. అతని బూడ్సుల చప్పుడు వినగానే భయంతో గుండెలు గుబగుబలాడేవి. కాని అతను దగ్గిరికి రాగానే, మీద చెయ్యి వెయ్యగానే, యింక వేరే లోకమూ, ధ్యాసా లేవు. అతనివంక చూడడం, దగ్గిరికి లాక్కోడం, ఒళ్ళు మరిచి అనుభవించడం, అంతేపని.

నెలరోజులకి నాకో చిన్నగడ్డ లేచింది. కిష్టయ్యతో చెపితే, అదే పోతుందని, ఒక చిన్న పట్టీ ఇచ్చాడు. కాని అది విన్నప్పుడు అతని మొహంలో మార్పు చూసి నాకు అప్పుడప్పుడు ఆశ్చర్యం వేసింది.

నాలుగు నెలల్లో నా వొంటిమీద నల్లని మచ్చలు బైలుదేరాయి. చూసుకుంటే అసహ్యమూ, భయమూ వేసింది. ఆయనతో చెపితే యేమీ మాట్లాడలేదు. తరువాత ఆయన వొంటిమీద కూడా అంతకంటే భయంకరమైన మచ్చలుండడం చూశాను. నాకు యేదో నిశ్చయంగాని అనుమానం కలిగింది. రోగాలుంటాయని వినడమేగాని, వాటి స్వరూపం నాకేం తెలుసు! మర్యాదస్తులు అనుభవించేవి గాని, తెలుసుకుని జాగ్రత్తపడే విషయాలు కావు. నేనేం పాపం చేశాను? ధర్మశాస్త్రాలు చెప్పినట్లు భర్తకి దేహం వప్పచెప్పి సంపాయించుకున్న రోగం. నాకు తలంటిపోస్తో, మా దాసీది నా వొళ్ళుచూసి రోగం గుర్తుపట్టింది. దాని దగ్గిర్నించి తెలుసుకున్నా ఆ రోగం సంగతి, ఒకరినించి ఒకరికి వొస్తుందని, దాసీదాన్ని యెవరికీ చెప్పవద్దని కట్టుదిట్టం చేశారు. నాన్న కిష్టయ్యతో చెప్పినట్లున్నారు. అతను యేవో మందులిచ్చారు. కొంచెం నయమయింది అప్పటికి.

రోగం సంగతి తెలిసినప్పణ్ణించి కిష్టయ్య మీద నాకు రోత కలిగింది. దగ్గిరికి రానిచ్చేదాన్ని కాదు. అతని సామీప్యమే భరించశక్యం కాకండా వుండేది. నా సంగతి చూసి, అతనూ నన్ను ప్రేమతో చూడ్డం మానుకున్నాడు. రాత్రులు అతనెక్కడెక్కడో వుండిపోయేవాడు. ఒకరోజు సీతా అతనూ ఒక గదిలో వుండగా అమ్మ చూసింది. సీత తనకేం తెలీదని యేడ్చింది. కాని అనుమానంగానే వుంది. నాన్న కిష్టయ్యతో కఠినంగా మాట్లాడి యింట్లోంచి పొమ్మన్నట్టుగా తిట్టారు. నన్ను కూడా వెంటపెట్టుకుపోయి తిప్పలు పెడతాడని కాని, లేకపోతే యెప్పుడో అతన్ని తరిమేసేవారు. అదిగాక కిష్టయ్య అసలు డాక్టరు కాదనిన్నీ, అన్నీ గొంగవేషాలనిన్నీ, తెలిసి వూళ్ళో అతన్ని 'ప్రాసిక్యూషన్' చెయ్యాలని చూస్తోవుంటే, నాన్న వాళ్ళందర్నీ బతిమాలుకుని మాన్పించారు.

ఇంతలో నాకు గర్భిణి తటస్థమయింది. నా వేవిళ్ళలోనే వెంకట్రావు వొచ్చి సీతనిమ్మని అడిగి పెళ్ళి చేసుకున్నాడు.

ఒకరోజు తెల్లాకట్ట నేను దొడ్లోంచి వొస్తోవుంటే వెంకట్రావు గుమ్మంలో నుంచుని వున్నాడు. అప్పటి వరకు మేము మళ్ళీ మాట్లాడుకోలేదు. నా వంక అతను నిదానంగా చూసి.

"ఎందుకనుకున్నావు, నేను సీతని పెళ్ళి చేసుకుంది. చెంపలూ, కళ్ళూ, నీకు మల్లే వుంటుంది. అందుకని?" అన్నాడు.

"ఇంకా నా మీద యీ దయ యెందుకు?"

"నువ్వు చేసిన మోసం మరిచిపోగలిగాను. నిన్ను మరిచిపోలేకపోయాను."

ఆ లేతకాంతిలో జుట్టురేగి, కళ్ళు నలిగి, మనుషుల్లో విశ్వాసం పోయినందుకు. రాత్రంతా దుఃఖించిన వాడిమల్లే కనబడుతున్న అతనిమీద చాలా జాలి కలిగింది. ఎట్లాగో అతన్ని వోదార్చాలనిపించింది.

"వెంకట్రావ్, నువ్వు నమ్మవుగాని, అయినా చెపుతున్నాను. ఆయన అబద్దాలు చెప్పి నిన్నూ, నాన్ననీ మోసం చేశాడు."

"మేము చూసిందో?"

"అతని ఎదట నా దేహం నా స్వాధీనంలో వుండేదికాదు. ఆ భయంకర స్వప్నంలోంచి బైటపడాలనే నీ సహాయం అడిగాను. అది యిట్లా పరిణమించింది."

అతనూ సీతా ఆ మధ్యాహ్నమే వూరికి ప్రయాణమైనారు.

తొమ్మిది నెలలూ సరిగానే గడిచాయి. ఆయాసం లేకుండా కన్నాను. కళ్ళు తెరిచేటప్పటికి, నా పక్కన నా చిన్నబిడ్డ, నా కొత్త ప్రాణం, యేడుపు వినపడుతోంది. హృదయంలోంచి ప్రేమ వెల్లివిరిసింది. ఒక్కసారి రొమ్ముకి అద్దుకోవాలని పక్కకి తిరిగిచూసి, కెవ్వున కేకేసి పరుపు మీద పడ్డాను. ముక్కూ, చెవీ, నోరూ కలుసుకుని పెద్దగుంట ఆ పిల్లకి, రాక్షసిలాగుంది రూపం.

ఆ పిల్లని యెట్లా పెంచను? దానికి పాలియ్యడమెట్లా? ముద్దులొలుకుతో వుండవలసిన ఆ చిన్న పెదిమలు లేనేలేవు. నా స్తనాన్ని అంటి ఝుల్లుమనిపించవలసిన ఆ గులాబి లేతనోరు బదులు రంధ్రమేమిటి? దిక్కుమాలిన దాన్ని నా కెందుకు పుట్టావు? ఇది పెద్దదైతే దాన్నేం చేసుకోను? ఏమని దాన్ని నలుగురికి చూపించుకోను నా బిడ్డ అని. నా తొలిచూలా? నా ముద్దులబిడ్డా? నా గుండెల్లో బరువెక్కింది. ఇంతకీ నాకీ లోకంలో సంతోషమేమిటి? పదొమ్మిదేళ్లులేవు. లోపల గంపెడు పాడురోగం, అట్లాంటి భర్త. ఇట్లాంటిపిల్ల. మనసు చెల్లెలి మొగుడిమీద. నూరేళ్ళు బతకాలట! దేనికోసం? చావు కోరుకోడమంటే యేమిటో, లోకం మాయా, సంసారం దుఃఖసాగరమని యెందుకన్నారో, అప్పుడర్థమయింది. ఎవరో చచ్చిపోయినట్లు అందరూ నన్ను ఓదార్చారు. నా బిడ్డని, అదీ, నేనూ పూర్వజన్మలో చేసుకున్న పాపాన్నీ తిట్టీ, అది రాక్షసో, దెయ్యమో అయినట్లు మాట్లాడారు. ఆ చూడవచ్చిన వాళ్ళందరినీ కొట్టి, రక్కాలనిపించేది నాకు.

ఒకరోజు రాత్రి నా బిడ్డ మరణవేదనపడి, తెల్లరకట్ట నా వొళ్ళోనే ప్రాణం విడిచింది. నాకు సంతోషించాలో దుఃఖించాలో తెలీలేదు. ఆనాటినుంచి ఆ పిల్ల నా కలలో రావడం మొదలుపెట్టింది. నా యెదట నుంచుని, ఎర్రని నెత్తురుకారే ఆ రంధ్రంకేసి వేలు పెట్టి చూపించి హా అని అరిచేది. నేను కెవ్వున కేకేసి లేచేదాన్ని.

ఇంకో ఆర్నెల్లు గడిచాయి. కిష్టయ్య చర్మం తినేస్తోంది. డాక్టర్ని పిలవనీడు. తనే యేవో మందులు తాగేవాడు. నేను అమ్మదగ్గిరే పడుకునేదాన్ని. ఆయన్ని తాకడం

కూడా రోత అనిపిస్తోంది. చివరికి బలవంతంమీద పక్కబస్తీనించి డాక్టర్ని తీసుకొచ్చి మందిప్పించారు. కాని నన్ను మాత్రం డాక్టరుకి చూపే ప్రసక్తే రాలేదు.

సీతా వెంకట్రావు వొచ్చాడు. చెల్లి గర్భిణి. వెంకట్రావుని చూసిన మొదటిరోజే, యిన్ని నెల్లనించి అతన్నే ప్రేమిస్తున్నాననీ, అతనికోసమే అన్నాళ్లూ, కాచుకుని వున్నాననీ దుఃఖభాజనమైన నా జీవనానికి సౌందర్యరేఖ, పరమావధి అతనేననీ నాకు రూఢి కలిగింది. అతని ప్రేమ నా పాదాల వద్ద పావురంవలె రాలేట్టు చెయ్యాలి. నన్ను చూసి నిలవలేక, అతనే కోరి, దర్భరమైన తపన పొందాలి. నా సౌందర్యమే నా ఆయుధం, నా జుట్టులో అతని మనసు చిక్కుకునేట్టు, మొహంమీద వొంపుగా బరువుగా పడేటట్టు ముడివేశాను. అందమైన నా వక్షపు వుబుకును, ఆచ్ఛాదితమైన నా సౌందర్యాన్ని సూచించేట్టు. నా జాకెట్టు మెడలు బాగా కిందికి కత్తిరించాను. చిరునవ్వులు, తళతళ చూపులూ నా మొహాన తాండవమాడాయి. అందరూ వున్నా, నా కళ్లూ, మాటలూ అతనికోసమే వెతికేవి. యథావిధిగా యేర్పడ్డ భర్తని అడ్డం పెట్టుకుని యెట్లాంటి నాటకమన్నా ఆడడం చాలా సులభం. వెంకట్రావు వొక్కడూ వున్నప్పుడు యేమీ విషయం లేకుండానే యేమిటో మాట్లాడేదాన్ని. ఇవన్నీ సహజంగానే ప్రేమ నాకు నేర్పింది. మా చిన్నతనపు ఆటలూ, బుజాలమీద చేతులు వేసుకుని ఒకళ్లమాటల్లో ఒకళ్ళం ఆనందించుకున్న నిమిషాలూ, యిద్దరం భార్యా భర్తలమవుతామని సిగ్గుపడడం, చివన్నీ అతనితో మాట్లాడేదాన్ని నా మాటలకంటె, కళ్ళు యెక్కువ భావాలు వెలిబుచ్చేవి. సీతకి అన్యాం ఆ పని అనిపించింది. కాని సీత కిష్టయ్యతో ఓ గదిలో వుండడం చూడలేదా నేను! అసలు వెంకట్రావు నా వాడు. ఎవర్ని పెళ్ళి చేసుకున్నా నా వాడే!

"మనకే పెళ్ళైతే యిప్పుడేం చేస్తో వుండేవాళ్ళం" అన్నాను ఒక రోజు.

"నువ్వు యింకోడికోసం, నేను యింకొకత్తెకోసం వెతుక్కుంటూ" వుండేవాళ్ళం అన్నాడు చిరునవ్వుతో.

తల వంచుకున్నాను.

ఎందుకో వెంకట్రావు ఆలస్యం చేస్తున్నాడు. అతను 'రెస్పాన్సు' యివ్వనికొద్దీ నాకు జయాభిలాష యెక్కువయింది. ఒకరోజు రాత్రి అతన్ని తోసుకువేళ్ళేట్టు యెదురుగాపోయి నా బ్రోచికి గుచ్చుకున్న బొడ్డుమల్లె అతనికి చిరునవ్వుతో యిచ్చాను. దానివంక నిదానంగా చూస్తో. "తరవాత నన్నేమనీ ప్రయోజనం లేదు" అన్నాడు.

ఏం చేస్తే మాత్రం నాకేం భయం అన్నట్టుగా నుంచున్నాను, అతని కెదురుగా అతని చేతులు నావైపు జాపబోయినాడు. నా కాళ్ళు ఝుల్లుమని వొణికాయి. నా దేహమంతా అతనివేపు కదిలింది. కాని మళ్ళీ యెవరో వాటిని వెనకనించి లాగినట్లు చేతుల్ని తనే కిందికి అణుచుకుని వెళ్ళిపోతున్నాడు. నాకు అపరిమితమైన నిరాశ కలిగింది. యెన్నాళ్ళింకా? హేళనగా నవ్వాను. వెనక్కి తిరిగివొచ్చి నా చేతులు గట్టిగా పట్టుకుని.

"నా సంకోచాన్ని చూశా నవ్వుతున్నావు? నా బలం సంగతి నీకేం తెలుసు?" అని వొదిలి వెళ్ళిపోయాడు.

మర్నాడు సంజలో మా యిళ్ళకి మధ్య సందులో అప్రయత్నంగా కలుసుకున్నాము.

"రేపు మధ్యాహ్నం నా గదిలోకి రా!" అన్నాడు, బొంగురుపోయిన గొంతుకతో.

"వొద్దు"

"వొద్దూ! వొద్దేమిటి నీ మొహం!"

"నిజంగా వొద్దు"

నన్ను కావిలించుకొని "నాతో తమాషా నీకు?" అన్నాడు.

"తమాషా కాదు. నిజమే. నిన్ను నా వాణ్ణి చేసుకున్నాను. చాలు. చూడు." అని అతన్ని ముద్దు పెట్టుకుని.

"ఇంతే నాకు కావలసింది. యిట్టా రోజుకోసారి రా. చాలు. ఇందుకే నేను చేసిన ప్రయత్నాలన్నీ, యీ మొహాన్ని చూసుకుని, యిట్లా పట్టుకుని నాదనుకుని, యిట్లా... యింతే." నిజంగానే అనిపించింది అట్లా.

"యెంత సులభంగా అన్నావు ఆ మాట! ఆ ముద్దు మాధుర్యం ఆ పెదిమల దగ్గిర ఆగుతుందా? ఆపాదమస్తకం వుడికించి చీల్చివెయ్యదూ?... అంతా నీ యిష్టమేనా? వస్తాననంది నిన్నిక్కణ్ణించి కదలనీను. ఆ మాటలు కట్టిపెట్టు."

"నా మాట వినవూ?.... వొద్దు"

"యెందుకో చెప్పు."

"కారణముంది. నీ కోసమే. నన్నడక్కు."

"అయితే నేను నీకు కనపడను. యిట్లా తృప్తిపడడం నాచేత కాదు." అతనే కనపడకపోతే ఆ శూన్యంలో బతకడమెలాగు?

"సరే వొస్తాను. కాని, నా యిష్టం లేనిది..."

"..... సరేలే. రా."

మర్నాడు మధ్యాన్నం మెల్లిగా వెంకట్రావు గది దగ్గిరికి వెళ్ళి, వొణుకుతున్న వేళ్ళతో తలుపు తోశాను. లోపలికి వెళ్ళి, తలుపు గడియ వేసి, కిటికీ మూసి, చిరునవ్వుతో.

"వొచ్చాను మరి." అన్నాను అతని కెదురుగా నుంచుని.

కిటికీ సందుల్లోంచి నా జుట్టుమీద, నడుంమీదా యెండ చుక్కలు పడుతున్నాయి. నా బుజాలమీద చేతులేసి, దూరంగా తోసి, నా వొంక వూరికే కిందినించి పైకి చూస్తో నుంచున్నాడు అతను.

"యేమిటి చూస్తున్నావు?"

"నీ అందం!"

"బావున్నానా?"

దగ్గిరికి లాక్కుని గట్టిగా అదుముకున్నాడు. నాకు వూరిరాడక "అమ్మా!" అన్నాను. జుట్టు వూడిపోయింది. అతని చేతుల్లో వూగిపోయినాను. అతి కాపీనంతో నా వొళ్ళంతా తాకాడు. చీర వూడి నా కాళ్ళచుట్టూ పడ్డది. తింటే అయిపోతుందేమోనని, అట్లానే చేతులో పండుని పట్టుకుని దానివంక చూస్తూ ఆనందించే కుఱ్ఱవాడివలె, యెడంగా నుంచుని, నా దేహపు రంగూ, నడుము వొంపులూ నా తొడల సవనవా, చూస్తూ.

"ఎంత బావున్నావు. చెల్లీ! ఇన్నాళ్ళూ, నిన్ను ఒకరోజు మరిచిపోలేదు. ఇట్లా నీ చేతుల్లో పడుకున్నట్లు, యెన్ని రాత్రులు ధ్యానించుకున్నాను! ఈ అందమంతా, యిక్కడ, యీ వొంపు చూడు. ఇక్కడ యిదంతా ఇదివరకే చూశా, కలల్లో. యెంత జీవితం వృధా అయింది! దగ్గిరికి యింకా..."

ప్రతి రక్తబిందువూ, నన్ను అతని దగ్గిరికి లాగేసింది. వెయ్యి నోళ్ళతో నా శరీరం అతను కావాలంది. తల తిరిగింది. చెవుల్లో హొరుమని శబ్దం వినపడ్డది. నన్ను నా శరీరాన్ని, ఆత్మని లాగేశాడు. అంతా చీకటి. అతని చేతులు నా చుట్టూ కలిసిపోయినాయి. కడ్డీవలె అతని నరాలు బిగిసుకున్నాయి. అతని కళ్ళల్లో భయంకరమైన ఆవేశం వెలుగుతోంది. అతని వేడి నిశ్వాసం నా చెంపమీద కాలుతోంది. నేను, అన్నీ మరచి, తీవ్రమైన ఆనందంలో శరీరాన్ని అతని కందిచ్చాను.... ఆ కళ్ళముందు చీకట్లో యెవరు అట్లా నుంచున్నారు? ఎఱ్ఱని రంధ్రం మీద వేలుపెట్టి చూపుతో... కెవ్వున అరచి, లేవబోయినాను. భయంతో వెంకట్రావు నన్ను వొదిలివేశాడు.

* * *

అద్దంముందు చీర పట్టుకుని నుంచుని జుట్టు సద్దుకోంటో, అతని వేపు చూశాను. కదలకుండా. తల దిండులో దూర్చుకొని వున్నాడు. విచారమా, బాధా, కోపమా?

తరవాత మళ్ళీ వెంకట్రావు దగ్గిరికి వెళ్ళడమంటే భయమేసింది. ఎప్పుడు శక్తిలేక లోబడతానో! అతన్ని నేను తప్పించుకు తిరగవలసిన గతిపట్టింది. అతనూ ఎప్పుడూ నా వెంట తిరిగేవాడు. అతన్ని నావేపు లాగి, మోహాన్ని రేపి, యిప్పుడు కారణం చెప్పకుండా, అతను నన్ను వాంఛించిన కొద్దీ, దూరమవుతోవుంటే అతని కెట్లావుందో! నా సంగతేమనుకున్నాడో! మళ్ళీ తనని కలుసుకోమని ప్రాణం తీసేశాడు. అందరూ అనుమానపడుతున్నారని చెప్పి కొన్నాళ్ళు తప్పించుకున్నాను. కాని యెంత మనసు బిగపట్టుకున్నా, ఒక్కొక్క రాత్రి వెంకట్రావు కావాలనిపించి పిచ్చేక్కేది. అతని తలని అదుముకోవాలని, అతని చేతుల్తో కళ్ళు మూసుకోవాలని నా శరీరమంతా, నరనరమూ

లాక్కుపోయి బాధపడేదాన్ని. తెల్లార్లూ నిద్ర పట్టేది కాదు. రాత్రులు అతని గదిలో సీతకూడా వుండేదిగాని లేకపోతే యెన్నిసార్లు వొళ్ళు తెలీక సాహసించి వేళ్ళేదాన్నో.

ట్రావలర్సు బంగళాలో యేర్పాటు చేశాను, రమ్మని చాలాసార్లు అడిగాడు. కొన్ని రోజులు మళ్ళీ తప్పించుకుని, తోసేసుకుని తిరిగాను. కాని చివరికి ఒకరోజు నా ముందు కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఆ మొహంలో బాధ వర్ణించలేను. నేను యెంత కష్టాన్నన్నా వోర్చుకోకలిగాను కాని, అతని కళ్ళల్లో బాధని చూసి తాళలేక పోయినాను. సాయంత్రం వొస్తానన్నాను. ఒకసారి వెడదామని నిశ్చయించుకోడం తోటే అంత నిగ్రహాశక్తి పట్టూడిపోయింది. వెంకట్రావు కోసం నిమిషాలు కూడా ఆగలేని తీవ్రతృష్ణ పట్టుకుంది. యెప్పుడు అతన్నంతా నా చేతుల్లో పట్టుకుంటానా అని ఆత్రుతగా వుంది. ప్రతి అడుక్కీ కాళ్ళు వొణికాయి. ప్రతి అడుగూ ఆటంకంలాగే తోచింది. యెంతో దూరంలాగు కనబడ్డది. వూరి వెలపల కాలవవొడ్డున, బంగాళాలో మంచంమీద పడుకుని వున్నాడు. అతని పక్కని కూచుని మీదనించి చెయ్యేసి, రొమ్ముమీదనించి మొహం దగ్గిరికి వొంగాను. కిటికీలోంచి బృహస్పతీ అర్ధచంద్రుడూ మమ్మల్నీ చూస్తున్నారు. చల్లని గాలి అతని జుట్టునీ, పచ్చని చొక్కానీ కదిలిస్తోంది.

"మాట్లాడవేం?" అన్నాను.

"యేంలేదు?"

"కోపమెందుకు? యిన్నాళ్ళకన్నా దయతలచి వొచ్చావని సంతోషించక!"

"అదుగో కోపం! యిన్నాళ్ళు రాలేదనేనా? నాకు రాకండా వుండాలని వుందనేకదూ నీ వుద్దేశ్యం?"

"కాక!"

"నా మాట నమ్ము. అంత మాత్రం విశ్వాసముండాలి."

"కారణం చెప్పరాదూ?"

"నన్నడగొద్దు. కాని కారణం లేకపోలేదు."

"పోదూ! యీ మాటలకేం? నాకు చెప్పకూడని కారణముందా! నీకే రావాలని యిష్టముంటే, నేనే కావలిస్తే, ఇన్నాళ్ళు దూరంగా వుండగలవా?"

ఎంతైనా మొగాళ్ళు వాళ్ళ వూహల ప్రకారమే, అనుభవం ప్రకారమే ఆలోచించుకుంటారు - స్త్రీల సంగతి కూడా. మా సంగతి, మా "ఇన్‌స్టింక్ట్సు" వేరని వాళ్ళకి యేమాత్రమూ తెలీదు. కోపమాపుకోలేక మళ్ళీ అన్నాడు, "నన్నెట్లా యేడిపిస్తున్నావని! మళ్ళీ నాకెందుకు కనపడ్డావు? నన్నెందుకిట్లా స్వాధీనం చేసుకున్నావు? మళ్ళీ నాకెందుకు లోబడవు?... ఛీ, ఛీ, పో, వెళ్ళిపో!

నా హృదయంలో శూలం నాటినట్లయింది. చెప్పనా? అమ్మో, యెట్లా వస్తాయి ఆ మాటలు! ఘోరం మళ్ళీ నా మొహం చూస్తాడా? అతని కళ్ళల్లో అసహ్యాన్ని చూడగలనా? యెట్లా నమ్మించడం?

"వెంకట్రావ్! నువ్వు నన్నిట్లా తృణీకరించడం నేను వొప్పుకోను. నాకు యెట్లాగో మళ్ళీ దొరికావు. నిన్ను వదలను. నువ్వు లేనిది నేను బతకలేను. నీ మీద ప్రేమ లేకపోతే యిట్లా నీ దగ్గిరికి వస్తానా! అంత ప్రయత్నం చేసి నిన్ను నా వాణ్ణి చేసుకుంటానా? నా కళ్ళల్లో చూడు. ప్రేమ కనపట్టంలేదూ? యిట్లారా. చెయ్యి యిట్లాతే. నీకే తెలుస్తుంది."

కూచున్న వెంకట్రావుని కావిలించుకుని మంచంమీద పడుకోపెట్టాను. అతనిపైన అనుకుని, అతన్నంతా నాతో, జుట్టుతో, నా మొహంతో, నా వూపిరితో ఆవరించుకుని నలిపేశాను. నా శరీరమంతా నలిగిపోయింది. నా వూపిరి ఆగిపోయింది. నా రక్తం అతని రక్తంలో కలిసి దూకుతో ప్రవహిస్తోంది. మండుతున్న నా పెదవులు. చలించే నా మెత్తని చేతులు, అతన్ని వెతికే నా నున్నని వక్షము, అతని అనుమానాన్ని కరిగించేశాయి. అలిసి సగం మూతపడ్డ అతని కళ్ళల్లోకి, బృహస్పతి కాంతిలో చూస్తో -

"యింకా నమ్మకంలేదూ?" అని అడిగాను.

"ఏంత మాధుర్యం యివ్వగలవు నువ్వు? యిప్పుడే యింత స్వర్గాన్ని అనుభవిస్తున్నానే..."

తక్కింది నా నోటితో మూసేశాను.

"నీ వొక్కడి కోసమే ప్రేమచూపే కొత్తవిధం యేదన్నా తెలిస్తే బావుండును. నీకు నమ్మకం పుట్టించడానికి" అన్నాను ఆయాసంతో.

నా చేతుల్ని వొదిలించుకుని, మోచేతిమీద ఆనుకుని, నా వంక చూశాడు. నల్లని నా జుట్టంతా దిండుమీద పరుచుకుని, మధ్య నా చిన్న నోరూ, వెన్నెల చంపలూ, పెద్దకళ్ళూ అతనికి కనపడివుండాలి. కళ్ళు మూసుకుని చిరునవ్వు నవ్వాను. నేను రేగకొట్టిన అతని మోహం ప్రళయమారుతం మల్లె నా మీద విరుచుకొని పడ్డది. రెక్కల పురుగువలె కొట్టుకుపోయినాను. అలలమీద నురుగువలె వూగిపోయినాను.

"వొద్దు, వొద్దు, వెంకట్రావ్ నా మాట విను"

"మాట్లాడకు, కదలకు"

"నమస్కారం చేస్తా... నాకు అసహ్యం" అని అబద్ధం చెప్పాను. కదలకుండా నా చేతులు పట్టుకుని,

"ఎన్నాళ్ళు యీ అబద్ధాలు! నీ పెదిమలు దొంగవైతే నీ కళ్లు నిజం మాట్లాట్టం లేదనుకున్నావా?..."

* * *

అలసి అతని యెదురు రొమ్ముమీద నిద్రపోయినాను.

ఇంటికి వెళ్ళేటప్పటికి రాత్రి పదకొండయింది. కిష్టయ్య మేలుకుని వున్నాడు. నా ఎర్రని పెదిమా, మెరిసే కళ్ళూ, రేగిన జుట్టూ, వొణికే వొళ్ళూ చూశాడు.

"ఎక్కణ్ణించి?"

నాకు వెర్రి సాహసం పుట్టింది.

"నీ కెందుకు?"

"నాకు తెలుసులే. వాడూ నువ్వూ యెక్కడో...." నా వొళ్ళు మండిపోతోంది. వీడిమూలానే నిర్భయంగా నా నాధుణ్ణి కలుసుకోడానికి వీల్లేదు. వీడే మమ్మల్నిద్దర్నీ ఆజన్మాంతమూ వేరు చేసింది. కష్టపెట్టింది. అబద్దాలు చెప్పి నన్ను తన మచ్చల వొంటికి కట్టుకుంది.

"నీకేం?"

"నాకేం? నేనిట్టా జబ్బుతో చస్తోవుంటే నువ్వు... ముండా... ముండా"

లేచివొచ్చి జుట్టుపట్టుకుని వీపుమీద గుద్దాడు. విదిలించుకుని దూరంగా వెళ్ళాను.

"నా దేహం పాడుచేశావు. నా బిడ్డని చూడ్డానికి వీలులేకుండా చేసి కనిపించావు. నా వెంకట్రావుకీ నాకూ అబద్దాలు చెప్పి..."

కోపమాపుకోలేక పోయినాను. నా కాలికున్న స్లిప్పరు చేత్తోతీసి, వాణ్ణి యీ దవడమీద ఆ దవడమీద కొట్టాను. చెయ్యి రక్తమయింది.

తరువాత ప్రతిరోజూ వెంకట్రావుని కలుసుకున్నాను. యింట్లో అందరికీ తెలుసుననుకుంటా. కాని నేనేమి ఆలోచించదలుచుకోలేదు. ఆ స్వర్గానుభవం నాల్గు నాళ్ళు మాత్రమేనని తెలుసు - వెంకట్రావుకి తెలిసిందాకా. ఆ సంగతి తలుచుకున్నప్పుడల్లా, నిరాశతో, భరించలేని కోపంతో, కొట్టుకునేదాన్ని, ఎట్లనన్నా విధిని జయించాలని, నా వెంకట్రావుని నా వాణ్ణిగానే వుంచుకోవాలని. నాలో నేను పెనుగులాడేదాన్ని. వెంకటేశ్వర్లకు, నా జుట్టూ, నగలూ యిచ్చేస్తానని మొక్కుకున్నా, ఒకరోజు పొద్దున్న నేను లేచేటప్పటికి ఆ మచ్చలన్నీ పోయి ఆరోగ్యంగావుంటే, పోనీ వెంకట్రావుకు ఆ ఆపద తప్పితే... క్రిష్ణాపత్రికలో మందు ప్రకటన వుంటే, దాని కోసం రహస్యంగా రాశాను. ఎందుకు నాకిట్టాంటి ఖర్మం పట్టాలి? ధర్మ సందేహాలతో నా జీవితానికి మిగిలిన యీ వొక్క పండగా పాడు చేసుకుంటానా? ఎవరే మనుకుంటారో అనే భయంతో! అవన్నీ అదృష్టవంతుల ఆలోచనలు, మర్యాదస్తుల చరిత్రలు, నిర్భాగ్యురాలిని, నన్ను గురించి ఎవరేమనుకుంటే నాకేం లెఖ్ఖ!

* * *

ఆ పదిరోజులు నేనూ వెంకట్రావు యెంత ఆనందం అనుభవించామని! రోజుల్లా సాయంత్రం కోసమే బతికేదాన్ని. తినడం, వూపిరి పీలవడం, నిద్రా అన్నీ అందుకోసమే. సూర్యుడు కిందికి వాలుతోవుంటే చేతులుజాచి ముద్దు పెట్టుకోవాలనిపించేది. ఏ విధంగానన్నా, ఆయనకి నా కృతజ్ఞత తెలియ చెయ్యాలనిపించేది.

* * *

ఒకరోజు రాత్రి బంగాళాలో అద్దంముందు నుంచునివున్నాను. పెద్ద చంద్రుడు యెదురుగా వెలుగుతున్నాడు. వెంకట్రావు పక్కమీద పడుకుని చూస్తున్నాడు. నా చీరా, బెల్టూ పక్కకింద కుప్పగా పడివున్నాయి.

"నువ్వు నన్నిట్లా చూసినప్పణ్ణించి నా వొంటిమీద నాకు ప్రేమ ఎక్కువవుతోంది. ఇప్పుడు ఎంత భద్రంగా శుభ్రంగా వుంచుతాననుకున్నావు! ఇది నీది కదూ? ఆ సంగతి తలుచుకున్నప్పుడల్లా...."

వెంకట్రావు మంచంమీదనించి చప్పునలేచి వొచ్చి రొమ్ముకింద ముద్దుపెట్టుకున్నాడు.

"ఈ పదిరోజులు అక్కడ యెన్ని వేలసార్లు ముద్దుపెట్టుకున్నావు? చాలు ననిపించడమూ, తృప్తీ, యేమీ లేవా యేమిటి?"

"బాధే!"

"నిజంగా ఆలోచిస్తే, బాధే, వుత్కృష్టమైన, దివ్యమైన, వాగ్మానసాతీతమైన, తీవ్రమైన నరకబాధ."

"ప్రతి నరాన్నీ చీలికలుగా చీల్చే బాధ అక్కడ ఆ యెత్తైన వొంపుని చూసినప్పుడల్లా, యేమిటో చెయ్యాలని, ఆ అందమంతా నాలోకి రావాలని, దాన్నంతా అక్కడ నించి తీసివేయాలని యేమిటేమిటో తెలీని, చెప్పలేని భరింపలేని బాధ కలుగుతుంది. కళ్ళు మైకం కమ్ముతాయి. నాలిక యెండిపోతుంది. చేతి నరాలు బిగుసుకుపోతాయి. యేం చెయ్యను! నా అశక్తి నా కర్థమవుతుంది. సృష్టి ఔన్నత్యం గోచరిస్తుంది."

* * *

తరవాత మూడురోజులకి సీత గుడ్డిపిల్లని కన్నది.

దేనికై భయపడుతున్నానో, యే రోజున ప్రళయమని ఎదురుచూస్తున్నానో, ఆ రోజు తటస్థమయింది. ఆ రాత్రి వెంకట్రావు చీకట్లో నుంచుని బైట తిరుగుతున్నాడు. నా గుండెలు భేరీలమల్లే కొట్టుకున్నాయి. మాట్లాడకండా ఎదురుగా నుంచున్నాను.

"ఏం చేశావు నన్ను? ఏం చేశావు? అయ్యో, చెల్లీ, ఏం గతిపట్టింది నీకు. ఎన్నాళ్ళబట్టి దాచావు యీ కాలకూట విషాన్ని నీ వొంటో? అయ్యో దౌర్భాగ్యురాలా, ఎంత అశనిపాతాన్ని భరించావు యీ సుందరరూపంలో! ఇంక ఎట్లా బతకను? దేనికోసం? ఈ మలినమైన

వొంటితో, ఈ ఘోర విషం రక్తంలో - ఎట్లా బతకను? ఎవరికోసం? ఇంక యేం చెయ్యను? యేమిగాను? యెక్కడ దిక్కు? యెందుకు చెప్పలేదు నాతో ముందే?"

"నాకేం తెలుసు వెంకట్రావ్! చెపితే నన్నసహ్యించుకుంటావనుకున్నాను."

"అయ్యో, యింత తెలీనిదానవా? ముందు ఒక్క మాటా, ఒక సౌజ్ఞ, ఒక్క చీటీ, నీకూ నాకూ అందరికీ యీ ఆపద తప్పేది."

"వెంకట్రావ్! నీ మాటలు నాకింకా అర్థం కావటంలేదు. బతకటానికి యేం లేదంటావేం? నన్ను వొదిలేస్తే వొదిలేశావు. సీతనేం చేస్తావు? గుడ్డిపిల్ల ఆ...."

"వుండు వుండు, అదీ గుడ్డిపిల్లగా యెందుకు పుట్టింది?... అవును... అవును... ఇదే కారణం, ముందే తోచలేదు నాకు. వుత్త అనుమానమనుకున్నా. తెలిసింది"

బిగ్గిరిగా అరుస్తున్నాడు. పిచ్చెక్కినట్లు.

"యిదే కారణం. ఛీ, ఛీ అబ్బా! వోర్చుకోలేను. వోర్చుకోలేను."

దగ్గిరికి వెళ్ళి చెయ్యేశాను.

"నువ్వెవరు? నేనెవ్వరు? ఆ బిడ్డెవరు? వెళ్ళు"

"యేం చేస్తావు?"

"యేదో ఒకటి."

వెళ్ళిపోతున్నాడు.

"వెంకట్రావ్, నేనూ బతకను. తెలీక చేశాను. నాదే తప్పు. ఇట్లా రా, ఒక్కమాట. అన్నీ మరిచిపోయినావా?"

వెళ్ళిపోయినాడు. వెనక పరిగెత్తాను. కాలవ అడ్డంగా వొచ్చింది. విరోధి లాగు. ఆగాను. నల్లని నీళ్ళు చచ్చిన బంధువుల్ని చూడ్డానికి వెడుతున్నట్లు యేడుస్తో పరుగెత్తుతున్నాయి.

ఆశలన్నీ మండిపోయినాయి. కట్టెనై నిలిచాను. మోడునై మూల పడ్డాను. ఇల్లు పట్టలేదు. లోకం పట్టలేదు. తల్లిదండ్రులు పట్టలేదు. మంచంమీద చచ్చినట్లు పడుకున్నాను. వెంకట్రావు వొచ్చి నన్ను మళ్ళీ పిలిచినట్లు కలలు వొచ్చేవి.

మూడో రోజున సీతపిల్లకి జబ్బుగా వుందని యేడుస్తున్నారు. మెల్లిగా లేచి సీత గదిలోకి వెళ్ళాను. ఆ పిల్ల మొహం చూసేప్పటికే నా కర్థమయింది. వొచ్చి పక్కమీద పడ్డాను. ఇంకో నెలలో నాకు గర్భం కలిగినట్టు తెలిసింది. నా వెంకట్రావు శిశువు. దైవమా నన్ను వెక్కిరించి కోసి చీల్చి పురుగులకి పెట్టతలుచుకున్నావా? ఏం పాపం చేశాను? మళ్ళీ ఆ నోరు, ఆ ముక్కు, వొద్దు, వొద్దు నా వెంకట్రావు ముద్దులబిడ్డని,

మోహపుబిడ్డని అట్లా చూడగలనా? చస్తాగానీ యీ బిడ్డని ఈ లోకంలోకి రానిస్తానా? అందుకని యీ పనిచేశా. ఒకమ్మ సహాయం చేసింది. కిష్టయ్య కనిపెట్టి పోలీసు వాళ్ళకి రిపోర్టు చేశాడు.

నన్ను శిక్షిస్తారుట. యేం పాపం చెయ్యకుండా నేననుభవించిన నిష్కారణమైన శిక్షల్లో ఇదెన్నో వంతు! నేను చేసిన పాపమేమిటి? కనికరించి ఆ బిడ్డ పుట్టకుండా ఆపినందుకు శిక్షిస్తారా! గుడ్డిదానిగానో, పిచ్చిదానిగానో కని, లోకంమీద పారేస్తే, లోకం దాన్ని వెక్కిరించి, యేడిపించి నలక్కొట్టేస్తే, అది శుద్ధ ధర్మమా! యీ రోగాలన్నీ వాళ్ల స్వంత సొమ్మైనట్లు, యెవరికీ వీటిసంగతి తెలీకుండా దాచి వుంచుకునే ధర్మాత్ములకి లేదూ? శిక్ష!

◆ ◆ ◆

*రచనాకాలం : 1927*

*ప్రచురణ : (నా కర్మమిట్లాకాలింది- కథల సంపుటి), స్టూడెంట్స్ బుక్ సెంటర్ పునర్ముద్రణ 1968*